www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 26 జులై 2024



రాధాకృష్ణ ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఉద్యోగ సంఘాల నేతలు వినతి

ప్రజాశక్తి - భీమవరం

కాకినాడ మెడికల్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కాండ్రేంగుల రాధాకృష్ణ ఆత్మహత్యకు కారణమైన అధికారిపై చర్యలు తీసుకోవాలని ఎపి జెఎసి, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ చౌడగిరి శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్ వద్ద ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో రాధాకృష్ణ మృతికి కారణమైన అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం నిరసన తెలిపి జిల్లా కలెక్టర్ నాగరాణికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెనుమరెడ్డి శ్రీనివాస్, మెడికల్ శాఖ మినిస్టీరియల్ సంఘం నాయకులు చీకట్ల శివాజీ పాల్గొన్నారు.

భారీ వర్షం.. తీరని నష్టం

- కుళ్లిపోతున్న నారుమళ్లు, నాట్లు
- రక్షించుకునేందుకు రైతుల అష్టకష్టాలు
- 37,182 ఎకరాల్లో దెబ్బతిన్న నారుమళ్లు, నాట్లు
- రూ.41.52 కోట్లు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా



గరగపర్రులో కుళ్లిపోయిన నారును చూపిస్తున్న రైతు ఏడుకొండలు

ప్రజాశక్తి - భీమవరం

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. రోజులు తరబడి వర్షపు నీటిలో నారుమళ్లు, నాట్లు ఉండటంతో కుళ్లిపోతున్నాయి. జిల్లావ్యాప్తంగా 37,182 ఎకరాల్లో నారుమళ్లు, నాట్లు పూర్తిగా దెబ్బతినడంతో రూ.41.52 కోట్లు మేర నష్టం వాటినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అయితే మరోమారు రైతులు నారుమళ్లు, నాట్లు వేసే పరిస్థితి లేదు. ఇప్పటికే ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ రైతులు నష్టపోయిన పరిస్థితి ఉంది. అయితే నారుమళ్లు, నాట్లను రక్షించుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభం నుంచి అన్నీ ఇబ్బందులే ఎదురవుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. దీనికి వరద తోడవడంతో వరి చేలు ముంపుబారిన పడ్డాయి. వారం రోజులుగా నాట్లు, నారుమళ్లు నీటిలోనే నానుతుండటంతో రైతులు విలవిల్లాడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 2.11 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు ప్రారంభించారు. అయితే ఖరీఫ్ సాగు ప్రారంభం నుంచి ఆటంకాలే ఎదురవుతున్నప్పటికీ వాటిని అధిగమించి రైతులు ముందుకెళ్లేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. జూన్ ఒకటో తేదీనే కాలువలకు నీటిని విడుదల చేసినప్పటికీ రైతులు పూర్తిస్థాయిలో సాగుకు సన్నద్ధం కాలేదు. శివారు ప్రాంతాలకు సాగునీరు అందకపోవడం, ఎండల తీవ్రత తగ్గకపోవడం తదితర కారణాల రీత్యా రైతులు ఇబ్బందులు పడ్డారు. దీనికితోడు దాళ్వా ధాన్యం సొమ్ము చేతికి రాకపోవడంతో పెట్టుబడుల కోసం నానావస్థలు పడ్డారు. ఆ సొమ్ము రాకపోయినా ప్రయివేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పు చేసి మళ్లీ సాగు ప్రారంభించారు. అయితే సాగు ముమ్మరంగా సాగుతున్న తరుణంలోనే భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో పొలాలన్నీ ముంపుబారిన పడ్డాయి. తొలి వర్షాలే అయినప్పటికీ మురుగుకాల్వలో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడం, తదితర కారణాల రీత్యా ముంపు సమస్య మరింత తీవ్రమైంది. దీంతో వారం రోజులుగా నారు, నట్లు నీటిలోనే నానుతూ కుళ్లిపోతుండటంతో అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 92 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తవ్వగా సుమారు 35 వేల ఎకరాల్లో నాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. నారు నష్టపోయిన ప్రాంతాల్లో మళ్లీ నారుమళ్లు వేసి నాట్లు వేయాలంటే సుమారు నెల రోజులు సమయం అవసరం. అలాగైతే మళ్లీ ఆగస్టులో వచ్చే వర్షాలకు చిక్కితే నష్టం రెట్టింపవుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో సాగు ఆలోచన మాని ఉన్న నారు, నాట్లను రక్షించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో 37,182 ఎకరాల్లో నారుమళ్లు, నాట్లు దెబ్బతినడంతో రూ.41.52 కోట్లు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అయితే ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తమను ఆదుకోవాలని రైతులంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పెట్టుబడి అంతా నీటిపాలు

పల్లి వెంకట్రావు, కౌలురైతు, గుంపర్రు



చాలాకాలం నుంచి ఎనిమిదెకరాలు పొలం కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాను. గత రబీ సీజన్ ధాన్యం సొమ్ము నేటికీ పూర్తిస్థాయిలో అందలేదు. అప్పు చేసే ఖరీఫ్ సాగు చేపట్టాను. ఎకరానికి రూ.13 వేలు చొప్పున రూ.లక్షా నాలుగు వేల వరకూ పెట్టుబడి పెట్టాను. ఇటీవల కురిసిన వర్షానికి ఎనిమిది ఎకరాల చేను మొత్తం మునిగిపోయింది. పెట్టిన పెట్టుబడి అంతా నీటిపాలైంది. గత పంట తాలూకా అప్పులు, తాజాగా పంట సాగుకు చేసిన అప్పులు తడిసి మోపెడయ్యాయి. దీంతో ఏం చేయాలో తెలియడం లేదు.

ప్రభుత్వం ఆదుకోవాలి

బండి త్రిమూర్తులు, రైతు, కాంబొట్లపాలెం



ఇటీవల కురిసిన వర్షాలకు చేలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎనిమిదెకరాలు సాగు చేస్తున్నాను. వారం రోజుల నుంచి చేను నీటిలోనే నానడంతో మొత్తం కుళ్లిపోయింది. ఎకరాకు రూ.15 వేలు వరకు పెట్టుబడి పెట్టాను. సుమారు లక్షా 20 వేలు పూర్తిగా నష్టపోయాను. రెండు, మూడు రోజుల్లోనే నాట్లు వేయాల్సి ఉండగా భారీ వర్షాలు కురవడంతో నారుమడి పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం ఎక్కడా నారు దొరికే పరిస్థితి లేదు. ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలి.

తగ్గిన గోదావరి వరద

మళ్లీ భద్రాచలం వద్ద పెరుగుతుండటంతో సర్వత్రా ఆందోళన



కోడేరు వద్ద తగ్గుముఖం పట్టిన వరద గోదావరి

ప్రజాశక్తి - ఆచంట

రెండు రోజులుగా పెరుగుతూ వచ్చిన వశిష్ట గోదావరి గురువారం కాస్త శాంతించింది. కోడేరు, పెదమల్లం రేవుల్లో రెండు అడుగుల మేర నీటిమట్టం తగ్గింది. గోదావరి తగ్గుముఖం పట్టడంతో అధికారులతోపాటు లంక గ్రామాల ప్రజలు గురువారం మధ్యాహ్నం వరకూ ఊపిరి పీల్చుకున్నారు. అదే సమయంలో భద్రాచలం వద్ద గోదావరి వరద పెరుగుతుందనే సమాచారంతో అంతా ఒక్కసారిగా డీలా పడ్డారు. వరద తగ్గిన నేపథ్యంలో మిగిలిన పంటలనైనా రక్షించుకునేందుకు రైతులు పరుగులు తీస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని కరుగోరుమిల్లి పుష్కర ఘాటు ఇంకా ముంపులోనే ఉంది. అయితే ఎగువ ప్రాంతాల్లో మళ్లీ గోదావరి పెరుగుతుండడంతో శుక్రవారం గోదావరి వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కోతకు గురవుతున్న లంక భూములు

గోదావరికి వరద వచ్చినప్పుడల్లా ఎకరాల కొద్దీ లంక భూములు నదిలో కలిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల పరిధిలో పెనుగొండ, ఆచంట, యలమంచిలి మండలాల్లో ఇప్పటికే సుమారు వెయ్యి ఎకరాల వరకు లంక భూములు కోతకు గురయ్యాయి. ఆచంట మండలం పల్లెపాలెం గ్రామం సైతం కోత బారిన పడింది. పలు ఇళ్లు సైతం గోదావరిలో కలిసిపోయాయి. అయోధ్యలంక, దొడ్డిపట్ల, కనకాయలంక వంటి గ్రామాల్లో భారీ ఎత్తున భూములు కోతకు గురవుతున్నాయి. దీంతో ఏటా రైతులు విలువైన లంక భూములను కోల్పోతున్నారు.

వెంటాడుతున్న పశుగ్రాసం కొరత

లంక భూముల్లో పశుగ్రాసం అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల రైతులు సుమారు ఎనిమిది వేల వరకు పశువులు పెంచుతున్నారు. వరదల వల్ల లంక భూముల్లోకి వరద నీరు చేరి పశుగ్రాసం కొరత ఏర్పడటంతో మూగ జీవాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో పాల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోయిందని చెబుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులకు పశుగ్రాసం అందించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

యలమంచిలి: గోదావరి వరద గురువారం కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం తదితర గ్రామాల్లో ఇళ్ల చుట్టూ వరద పరిస్థితి కొనసాగుతోంది. దీంతో అక్కడి ప్రజలకు పడవలపై రాకపోకలు తప్పడం లేదు. ఆరు రోజులుగా వర్షాలు, వరద కారణంగా స్థానిక లంక గ్రామాల ప్రజలకు ఉపాధి లేక ఇల్లు నడవడం కష్టంగా మారింది. పశువులకు మేత దొరకడం లేదు. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి తమను ఆదుకోవాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నరసాపురం: ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వరద నీటితో నరసాపురంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే నరసాపురంలోని అన్ని స్నానఘట్టాలు నీట మునిగాయి.

సిపిఎఫ్ కాంట్రాక్ట్ కార్మికులకు పరిహారం చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపాలన్, రాయ్



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

గణపవరం మండలం సరిపల్లిలో థాయిలాండ్‌కు చెందిన సిపిఎఫ్ కంపెనీ ఆకస్మికంగా మూసివేనందున కాంట్రాక్ట్ కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.ఎన్.వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ డిమాండ్ చేశారు. చట్టవిరుద్ధంగా పరిశ్రమలు మూసివేసి కనీసం కార్మికులకు తగిన నష్టపరిహారం చెల్లించకుండా రోడ్డున పడేస్తున్నారని ఆరోపించారు. సిపిఎఫ్ కాంట్రాక్ట్స్ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్, రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా పరిశ్రమను నడుపుతున్నారన్నారు. ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య ఇంజినీరింగ్ చదువుతున్న యువత కూడా ఇక్కడ ఉపాధి పొందుతున్నారన్నారు. ఎటువంటి నిబంధనలూ పాటించకుండానే యాజమాన్యం ఏకపక్షంగా పరిశ్రమ్నుఉ ఆకస్మికంగా మూసివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన చేపట్టిన తర్వాతే పర్మినెంట్ కార్మికులకు నష్టపరిహారం చెల్లించారని, కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోలేదని విమర్శించారు. వీరికి తక్షణం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగా లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని పాలకులు హామీ ఇస్తున్నారని, జిల్లాలో వరుసగా అనేక పరిశ్రమలు మూతపడి వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాలకుల అండ చూసుకుని యాజమాన్యాలు ఇష్టానుసారం పరిశ్రమలు మూసివేయడం, నష్టపరిహారం చెల్లించకుండా తప్పించుకుంటున్నారని విమర్శించారు. సిపిఎఫ్ కార్మికులు అందరికీ నష్టపరిహారం చెల్లించే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ నాగరాణికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఇ.ప్రకాష్, ధర్మ, కె.శ్రీను, కత్తుల పెద్దిరాజు, సిహెచ్.జగదీశ్వరి, ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి - నరసాపురం

రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు గ్రాంట్ రూపంలో ఇవ్వకుండా అప్పు పేరిట కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు విమర్శించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని, పోలవరం నిర్మాణం, నిర్వాసితులకు పునరావాసానికి సంబంధించిన నిధులపై స్పష్టత లేదని, విశాఖ రైల్వే జోన్ ప్రస్తావనే లేదని విమర్శించారు. తక్షణం రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాజధాని నిర్మాణానికి నిధులు, ప్రత్యేక హోదా, రైల్వేజోన్ తదితర అంశాలు సాధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పొన్నాడ రాము, పొగాకు నారాయణరావు, ఎన్.కొండ, కుక్కల శ్రీరామ్మూర్తి, గుబ్బల నాగేశ్వరరావు, చిన్ని, రవి, పొన్నాడ మల్లేష్, బుడితి ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు రూ.10 కోట్లు

డ్రెయినేజీ శాఖ ఇఇ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు

భీమవరం టౌన్: జిల్లాలోని వివిధ డ్రెయిన్లలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలను తక్షణమే తొలగించేందుకు రూ.10 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని డ్రెయినేజీ శాఖ ఇఇ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. జిల్లాలో గోస్తనీ, యనమదుర్రు, బొండాడ, గొంతేరు, మొగల్తూరు, కాజ డ్రెయిన్లతోపాటు నక్కలకాల్వ తదితర వాటిలో గుర్రపుడెక్క పెరిగిపోయిందన్నారు. ముఖ్యంగా 21 పెద్ద డ్రెయిన్లు ఉన్నాయని, 59 మధ్యస్థ, 579 చిన్న డ్రెయిన్లు ఉన్నాయన్నారు. డ్రెయిన్లలో గుర్రపుడెక్క ఉండడంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మురుగునీరు దిగువకు ప్రవహించడం లేదని తెలిపారు. దీంతో యుద్ధప్రాతిపదికన డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం రూ.5.5 కోట్లు మంజూరవ్వగా రూ.మూడు కోట్లు విడుదలయ్యాయయని తెలిపారు. పలు డ్రెయిన్లలో రసాయనాల పిచికారీ జరిగిందని, కొన్ని డ్రెయిన్లలో యంత్రాల ద్వారా తొలగిస్తున్నామని వివరించారు.. త్వరలోనే అన్ని డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క తొలగించి మురుగు ప్రవాహనికి ఆటంకం లేకుండా చూస్తామన్నారు.


వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి : కలెక్టర్



ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో ఆమె ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ శాఖల అధికారులతో సమావేశమై సమీక్షించారు. జిల్లాలో 46 ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ వసతిగృహాలు నిర్వహిస్తుండగా వాటిలో 35 ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.2.65 కోట్ల అంచనాలతో గృహనిర్మాణ శాఖ ప్రతిపాదన తయారు చేసి సమర్పించిందన్నారు. అత్యవసర మరమ్మతులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలన్నారు. వసతి గృహాల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, జిల్లా గృహనిర్మాణ శాఖ ఇఇ జి.పిచ్చయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధి. కారి జివిఆర్‌కెఎస్ఎస్.గణపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఎస్.సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ హెచ్‌డబ్ల్యుఒ భానుమణి, ట్రైబల్ వెల్ఫేర్ హెచ్‌డబ్ల్యుఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి



నరసాపురం :ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

వీరవాసరం :విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఇఒ శ్రీమన్నారాయణను కోరారు. రాష్ట్రంలో అమలుచేసిన విద్యా సంస్కరణల ఫలితంగా విద్యావ్యవస్థ అస్తవ్యవస్తంగా మారిందని నాయకులు తెలిపారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు విశ్వాసం సడలిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంఇఒకు అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జివి.రమణ, ముద్రగళ్ల శ్రీనివాసరావు, డి.పుల్లారావు, కె.నాగమునేశ్వరరావు, ప్రసాదుబాబు, దుర్గారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురం : పాఠశాల విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ గురువారం నరసాపురం ఎంఇఒ పుష్పరాజ్యంకు యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.కృష్ణకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు జరిగిన విద్యారంగ సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రులు విశ్వాసం సడలిపోతోందని, ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమైపోతున్నాయని తెలిపారు. పరిస్థితులు విషమించకముందే ప్రభుత్వం మేల్కొని పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జిఎస్ఎస్ ఆర్.స్వామి, మండల శాఖ గౌరవాధ్యక్షులు పి.శాంసన్, అధ్యక్షులు ఎన్‌వి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.అజయ్‌కుమార్, సహాధ్యక్షులు ఎన్.విజయ్ కుమార్, రాజశ్రీ పాల్గొన్నారు.

ప్రచారం మెండు.. సాయం అరకొర..!

- మళ్లీ పెరుగుతున్న గోదావరి ఉధృతి
- భద్రాచలం వద్ద 49 అడుగులకు చేరిన నీటిమట్టం
- వరద బాధితుల కష్టాలు వర్ణనాతీతం
- కొండపైకి చేరిన రుద్రంకోట గ్రామస్తుల పట్ల నిర్లక్ష్యం
- బియ్యం, నిత్యావసరాలు, కొవ్వొత్తులు, జనరేటర్ ఏఒక్కటీ ఇవ్వని దుస్థితి
- టార్ఫలిన్లు చిన్నవి ఇవ్వడంతో గుడారాలకు సరిపోని వైనం



కొండపై ఉన్న రుద్రంకోట గ్రామస్తులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి వరద బాధితుల పట్ల అధికారులు చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితికి ఏమాత్రం సంబంధం లేకుండాపోయింది. బియ్యం, నిత్యావసర వస్తువులు, పాలు, కొవ్వొత్తులు, మస్కిటోక్యాయిల్స్ ఏఒక్కటీ సరిగ్గా అందని దుస్థితి నెలకొంది. అక్కడక్కడా కొద్దిమందికి ఇచ్చి వరద బాధితులందరికీ ఇచ్చినట్లు ప్రకటనలు గుప్పిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. కొండపైకి వెళ్లిన వారికి జనరేటర్లు ఏర్పాటు చేయకపోవడంతో సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టుకోవడానికి సైతం మళ్లీ గ్రామాల్లోకి రావాల్సిన పరిస్థితి నెలకొంది. రుద్రంకోట గ్రామస్తులు పడుతున్న అవస్థలే అందుకు నిదర్శనం. వరద ఉధృతికి భయపడి వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామానికి చెందిన దాదాపు 80 కుటుంబాలు దగ్గర్లోని కొండపైకి వెళ్లి గుడారాలు వేసుకున్నారు. వరద ఉధృతి మళ్లీ పెరుగుతుండటంతో మరికొన్ని కుటుంబాలు కొండపైకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. వీళ్లకు ఇప్పటి వరకూ బియ్యం, కొవ్వొత్తులు, మస్కిటోక్వాయిల్స్, పాలు, నిత్యావసర వస్తువులు వంటివి ఏఒక్కటీ అందించలేదు. కూరగాయలు అందించినా అవి మూడొంతులు కుళ్లిపోయినట్లు బాధితులు చెబుతున్నారు. గత వరదలకు రుద్రంకోట ప్రజలు ఉన్న కొండపై రెండు జనరేటర్లు ఏర్పాటు చేశారు. 12 జనరేటర్లు అందుబాటులో ఉంచినట్లు చెబుతున్నా రుద్రంకోట గ్రామస్తులు ఉన్న కొండపై ఇప్పటికీ జనరేటర్ ఏర్పాటు చేయని పరిస్థితి ఉంది. కొండలపై గుడారాలు వేసుకునే వారికి ఇచ్చిన టార్ఫలిన్లు సైతం చాలీచాలనవి ఇవ్వడంపై బాధితులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గత వరదలకు 24-36 సైజుగల టార్ఫలిన్లు ఇస్తే ఈసారి 18-24 సైజుగల టార్ఫలిన్లు ఇచ్చారు. దీంతో గుడారాలు వేసుకునేందుకు సరిపోవడం లేదని బాధితులు చెబుతున్నారు. రెండు లాంచీలపై బియ్యం, నిత్యావసర వస్తువులు చేరవేసి వరద బాధితులందరికీ సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. దాచారం కాలనీలోని రాపాకగొమ్మి ప్రజల సమస్యలపై మీడియాలో కథనాలు వచ్చాకే అధికారులు స్పందించారు. అయితే అదే సమయంలో మిగిలిన గ్రామాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. భోజనం అందించడం నిలిపివేసినప్పుడు నిత్యావసర సరుకులు అందించాలని వరద బాధితులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్‌పి విస్తృత పర్యటనలు చేసి జారీ చేస్తున్న ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఉన్నతాధికారులు వరద బాధితుల సమస్యలపై మరింత దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు. లేకపోతే వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో మున్ముందు పరిస్థితి ఏమిటనే ప్రశ్న అందరినీ వెంటాడుతోంది.

వీడని వరద భయం

గోదావరి వరద ఉధృతి మళ్లీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద బుధవారం 45 అడుగులకు చేరిన నీటిమట్టం గురువారం సాయంత్రానికి మళ్లీ 49 అడుగులకు పెరిగింది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. పోలవరం ఎగువ కాఫర్‌డ్యామ్ వద్ద నీటిమట్టం 33.100 మీటర్లకు చేరగా దిగువకు దాదాపు 11 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తగ్గినట్టే తగ్గి గోదావరి వరద పెరగడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మళ్లీ హైటెన్షన్ మొదలైంది. ఇప్పటికే గొమ్ముగూడెం, రాపాకగొమ్మి, కొండ్యినముక్తి, కొయిదా వంటి పలు గ్రామాలకు చెందిన ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరారు. రుద్రంకోటతోపాటు పలు గ్రామస్తులు కొండలపైకి వెళ్లి గుడారాలు వేసుకున్నారు. శుక్రవారం నాటికి భద్రాచలం వద్ద నీటిమట్టం 52 అడుగులకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. వరద ఉధృతి పెరిగి మరికొన్ని గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించాల్సిన దుస్థితి ఏర్పడనుంది. ఇప్పటికే పునరావాస కేంద్రాల్లోకి చేరిన వరద బాధితులను అధికార యంత్రాంగం సరిగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ధర్నా చేస్తున్న నేతలు

గునుపూడి సౌత్ డ్రెయిన్‌ను బాగుచేయాలి

రైతు కార్యాచరణ సమితి, కౌలు రైతు సంఘం నాయకుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరంలోని గునుపూడి, తాడేరు మురుగు కాలువలో పూడుకుపోయిన గుర్రపుడెక్క, తూడు తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ జిల్లా రైతు కార్యచరణ సమితి, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కాలువపై తాడేరు వంతెన వద్ద రైతులతో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు కార్యాచరణ గౌరవాధ్యక్షులు కలిదిండి గోపాలకృష్ణంరాజు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడారు. గునుపూడి డ్రెయిన్ పట్ల అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. వర్షాలకు పదిహేను రోజులుగా నారుమళ్లు మునకలో ఉన్నా కాలువలో చెత్త తీయకుండా కలుపు మందు కొట్టి వదిలేయడం సరైంది కాదని విమర్శించారు. దీంతో ఏటా రైతాంగం పంటలు కోల్పోయి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం యంత్రాల ద్వారా చెత్త తీయించాలని, జిల్లాలోని అన్ని కాలువలు ఒకే వ్యక్తికి ఇవ్వకుండా ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంలో తవ్వేలా టెండర్లు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కార్యాచరణ సమితి అధ్యక్షులు పాతపాటి మురళీకృష్ణంరాజు, జనరల్ సెక్రటరీ తమ్మినీడి నాగేశ్వరరావు, మంతెన కృష్ణంరాజు, గొట్టుముక్కల వెంకటభీమరాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

27న బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 27వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పురుషుల, స్త్రీల బీచ్ కబడ్డీ జట్ల ఎంపికలు మండలంలోని వీరవాసరం గ్రామం మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం వద్ద జరగనున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహాయక కార్యదర్శి పిఎస్ఎన్.మల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు పురుషులు బరువు 85 కేజీల్లోపు, స్త్రీలు 75 కేజీల్లోపు ఉన్నవారే అర్హులని తెలిపారు. ఎంపికలకు ఒరిజినల్ ఆధార్ కార్డుతో రావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 2, 3, 4 తేదీల్లో నెల్లూరు జిల్లా కోవూరు మండలం ఇందుకూరిపేట గ్రామంలో 3 రోజులపాటు జరగనున్న 11వ రాష్ట్రస్థాయి సీనియర్ బీచ్ కబడ్డీ ఛాంపియన్ షిప్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అదనపు వివరాలకు 8074153923 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - ఆచంట

మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. గురువారం కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రయివేటు పాఠశాలలకు దీటుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి చిలుకూరి వీర వెంకట సత్యానారాయణ మూర్తి, టిడిపి నేతలు బాలం వెంకటరమణ, ఆనందరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంట కాలువ ప్రక్షాళన పనులు మంచి నిర్ణయం

ప్రజాశక్తి - కాళ్ల


మంతెన వెంకట రవివర్మ

ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు వెంకయ్య వయ్యేరు పంట కాలువ ప్రక్షాళన చేసేందుకు మంచి నిర్ణయం తీసుకుని పనులు చేయడం అభినందనీయమని రైతు కార్యాచరణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మంతెన వెంకట రవి వర్మ అన్నారు. గురువారం ఏలూరుపాడులో విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్ల నుంచి వెంకయ్య వయ్యేరు కాలువ పూడుకుపోయిందన్నారు. ఉండి ఎంఎల్‌ఎగా గెలిచిన వెంటనే రఘురామకృష్ణంరాజు కాలువ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. పంట, మురుగుకాలువల అభివృద్ధికి, డ్రెయినేజీ మెయింటినెన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ఉండి అనే కార్యక్రమానికి, ఎంఎల్ఎ రైతులు, ప్రజల భాగస్వామ్యంతో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న ఆలోచన మంచి సంకల్పమన్నారు. రైతు కార్యాచరణ సమితి తరపున ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజును అభినందిస్తున్నామన్నారు.

పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యాబోధన

ప్రజాశక్తి - ఆచంట

ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగానే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యా బోధన సాగిస్తున్నారని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు తెలిపారు. వల్లూరులోని బాలికల వసతిగృహంలో బాలికలకు బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా లేదా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలన్నారు. మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకొని తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇటీవల మృతి చెందిన నరసాపురం ఎంపిడిఒ వెంకటరమణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వల్లూరు సర్పంచి ఎన్.బేబీ రామ్మోహన్, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాస్, ఎంపిటిసి సుబ్బారావు, వైఎస్ సర్పంచి గెద్దాడ శ్రీనివాస్, ఎంపిడిఒ నరసింహ పాల్గొన్నారు.

ఏలూరుపాడులో అన్న సమారాధన


ఏలూరుపాడులో జరుగుతున్న అన్న సమారాధన

కాళ్ల: ఏలూరుపాడు గ్రామంలో 24 ఏళ్ల నుంచి గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఏలూరుపాడు గ్రామ సాయిసేవా సమితి, మార్కెట్ యూత్, దాతలు, యాత్రికుల ఆర్థిక సహకారంతో భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పడమట సత్యనారాయణ, మాన్యం రమేష్, పడమట సుబ్బయ్య, పడమట త్రినాధ్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని కోట రోడ్డులో ఉన్న దత్త సాయి మందిరంలో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. శ్రీదత్త సాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను నిర్బంధం కాదు బాధ్యత

ఇన్‌కంట్యాక్స్ అధికారి శ్రీరామచంద్రమూర్తి

పాలకొల్లు : ఆదాయ పన్ను ప్రక్రియలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎఐ పాత్ర కీలకమని ఇన్‌కం టాక్స్ అధికారి శ్రీరామచంద్రమూర్తి చెప్పారు. స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో పాలకొల్లు ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యంలో ఆదాయ పన్ను ప్రక్రియపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, ఐటి ఆఫీసర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కళాశాల అధ్యక్షులు కెవిఆర్ నరసింహారావు, కార్యదర్శి కలిదిండి రామరాజు, ఆడిటర్ పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ హాజరై ప్రసంగించారు. ఐటి ఆఫీసర్ మాట్లాడుతూ ఆదాయ పన్ను నిర్బంధంగా, స్వచ్ఛందంగా, నైతిక బాధ్యతగా ప్రభుత్వానికి చెల్లించే రుసుంగా భావించాలని, తద్వారా దేశ సంక్షేమానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఐటి ఆఫీస్ పాలకొల్లు ఇన్‌స్పెక్టర్ గిరీష, ఛాంబర్స్ కళాశాల ప్రిన్సిపల్ వోల్గా పాల్గొన్నారు.

నీటిలోనే పంట పొలాలు

ఆకివీడు : మండలంలో పొలాలు మొత్తం నీటితో నిండిపోయాయి. నాట్లు నీటిలో నానుతున్నాయి. కాలువల్లో నీరు ఎక్కువగా ఉండడంతో పొలాల్లోని నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో రైతు ఆందోళన చెందుతున్నాడు. మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే ఆకు కుళ్లిపోతుందని, మరలా విత్తనాలు జల్లి నారు తయారు చేసుకోవాలని తెలిపారు. పెట్టుబడి ఖర్చు తడిసి మోపెడవుతుందని వాపోయారు. ఈ పరిస్థితుల్లో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కిసాన్ సంఘం మండల అధ్యక్షులు రాంబాబు అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు : గొరగనమూడి సబ్‌స్టేషన్‌లో 11కెవి శృంగవృక్షం ఇండస్ట్రియల్, బంటుమిల్లి ఫీడర్స్, మోగల్లు సబ్‌స్టేషన్‌లో 11 కెవి పాలకోడేరు, గరగపర్రు ఫీడర్ల మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన చేశారు. చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామని తెలిపారు. పెన్నాడ, శృంగవృక్షం, పాలకోడేరు, గరగపర్రు గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అహ్మద్‌ఖాన్ తెలియజేశారు.

ప్రజా సంస్కృతిని కాపాడాలి

భీమవరం : మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్న నేటి సమాజంలో ప్రజా సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత కళాకారులపై ఉందని మాజీ ఎంఎల్‌సి ఎంఇఎస్.శర్మ తెలిపారు. యుటిఎఫ్ కార్యాలయంలో గురువారం ప్రజా నాట్యమండలి రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు రెండో రోజు కొనసాగాయి. మాజీ ఎంఎల్‌సి శర్మ శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. ప్రజల్ని ఐక్య పర్చడమే ప్రజా కళాకారుడి కర్తవ్యమన్నారు. విచ్ఛిన్నకారుల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రమణ ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ మాట్లాడారు. మతోన్మాద పాలకుల ఏలుబడిలో యువతను ఉన్మాదం వైపు మరల్చే కుట్రలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.చైతన్య ప్రసాద్, షేక్ వలీ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలు.. ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరికి పోటెత్తిన వరద ఆచంట మండలంలోని లంక గ్రామాల రైతులను నిలువునా ముంచింది. లంక గ్రామాల భూముల్లోకి వరద నీరు చేరడంతో విలువైన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మండలంలోని కరుగోరుమిల్లి, కోడేరు, భీమలాపురం పరిధిలోని ఏటిగట్టు దిగువున ఉన్న లంకభూములు ముంపులో చిక్కుకున్నాయి. సుమారు నాలుగు అడుగుల మేర వరద నీరు చేరడంతో వివిధ రకాల పంటలు నీట మునిగాయి. కోడేరు శివారు ఉత్తరపాలెం లంక భూముల్లో వంగ, బెండ చిక్కుడు, పంటలు సాగవుతున్నాయి. భీమలాపురం, కరుగోరుమిల్లి భూముల్లో కొబ్బరి, అరటి, కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గోదావరి మధ్యలో ఉన్న అయోధ్యలంక పంచాయతీ పరిధిలో పుచ్చలంక, రాయిలంక, మర్రిమూల, పెదమల్లం పరిధిలోని ఆనగార్లలంక, పెదమల్లంలంక, భీమలాపురం పరిధిలోని కాపులపాలెం, కోడేరు దిగువన లంకభూముల్లో సుమారు 800 ఎకరాల్లో తమలపాకు, అరటి, కూరగాయల పంటలు సాగుతున్నాయి. గోదావరి వరద వల్ల తీరాన్ని ఆనుకొని పల్లపు ప్రాంతాల్లోని లంక భూములు నీట మునిగాయి. సుమారు మూడు రోజులపాటు లంక భూముల్లో వరద నీరు నిలిచిపోవడంతో కూరగాయల పంటలకు పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లింది. వంగ, బీర, మిర్చి, ఆనప పంటలు కుళ్లిపోయాయి. పెదమల్లం పరిధిలోని ఆనగార్లంక, పెదమల్లంలంకలో సుమారు 155 ఎకరాలు, అయోధ్యలంకలో 150 ఎకరాలు, భీమలాపురం, కోడేరు, పల్లెపాలెం పరిధిలో 45 ఎకరాల్లో సాగవుతున్న పంటలు నీట మునిగాయి.

ఎకరానికి రూ.60 వేల నుంచి రూ. 1.5 లక్షల వరకూ పెట్టుబడి

లంక భూముల్లో సాగవుతున్న పంటలకు రైతులు అధిక మొత్తంలోనే ఖర్చు చేశారు. తమలపాకు పంటకు ఎకరానికి రూ. 1.5 లక్షలు, కూరగాయల పంటలకు ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం పలు లంక గ్రామాల్లో కూరగాయల పంటలు చేతికందే స్థితిలో ఉన్నాయి. తమలపాకు పంట దాదాపు కోత దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో పంట భూముల్లోకి వరదనీరు చేరి బురద కప్పేయడంతో పంటలు కుళ్లిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నిండా ముంచిన వరదలు..

ఇప్పటికే ధర లేక దిగాలుగా ఉన్న రైతులను ఆకస్మికంగా వచ్చిన వరదలు నిండా ముంచాయి. తమలపాకు తోటలు 24 గంటల పాటు నీటిలో మునిగి ఉంటే తీగలు కుళ్లిపోయి ఆ తోట చనిపోతుంది. మూడు రోజుల నుంచి ముంపులోనే తోటలు ఉండడంతో నీట మునిగిన తోటలు పూర్తిగా దెబ్బతింటాయని రైతులు చెబుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో కౌలు రైతులు

లంక గ్రామాల్లో తమలపాకు పండించే రైతులు దాదాపు కౌలు రైతులే. ఎకరాకు ఆయా లంక భూముల్లో నీటి వసతిని బట్టి కౌలు రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకూ ఉంటుంది. దీంతో రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు ధర లేక వరదలకు దెబ్బతిన్న రైతులు కౌలు సంగతి దేవుడెరుగు పెట్టుబడి వస్తే చాలు అన్న దయనీయ స్థితిలో ఉన్నారు.

మద్యం షాపు దగ్ధం

రూ.18 లక్షల నష్టం

ప్రజాశక్తి - భీమవరంటౌన్

స్థానిక తాడేరు రోడ్డు గునిపూడిలో ఉన్న ప్రభుత్వ మద్యం షాప్‌లో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. షాపు లోపల నుంచి పొగలు రావడం గుర్తించిన నైట్ వాచ్‌మెన్ సూపర్‌వైజర్‌కు చెప్పడంతో ఆయన ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటీన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరాతీశారు. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అయితే షాపులో రూ.39 లక్షల విలువైన మద్యం బాటిళ్లతో సహా ఫర్నీచర్ కూడా దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు. మొత్తం రూ.18 లక్షల నష్టం వాటినట్లు తెలిపారు. సంఘటనా స్థలంలో డిఎస్‌పి నారాయణస్వామి రెడ్డి, రూరల్ సిఐ సత్య కిషోర్ ఉన్నారు. ఘటనపై మద్యం షాపు సూపర్‌వైజర్ బొడ్డు సునీల్ కుమార్ ఫిర్యాదు మేరకు వన్ టౌన్ ఎస్ఐ కె.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కారుకువాడ బేతపూడి సచివాలయం వద్ద ఉపాధి కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్‌కు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ బకాయిలు పూర్తిగా చెల్లించకపోవడంతో కార్మికులు కుటుంబ పోషణ రోజు వారి ఖర్చులు నిమిత్తం అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుంగ జాన్, మంద పెద్ద బుజ్జి, బుంగ లక్ష్మీకాంత్, బుంగ ఏసురత్నం పాల్గొన్నారు.


వెల్ఫేర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ చట్టం-2022ను రద్దు చేస్తూ శాసనసభ తీర్మానించడంపై హర్షం ప్రకటిస్తున్నామని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్ అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై న్యాయవాదులు శ్రీవిజ్ఞానవేదిక, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం భీమవరంలో ప్లకార్డులతో హర్షం తెలిపారు. ఈ సందర్భంగా న్యూటన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్ట్ తీసుకొచ్చి ప్రజలకు తీరని నష్టం కలిగించిందని, న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి ఆందోళనలు చేపట్టామని తెలిపారు. కూటమి ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి అడపా ప్రసన్న కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె.వెంకట్రావు, జాయింట్ సెక్రటరీ జె.సత్తిబాబు, లైబ్రరియన్ సెక్రటరి కె.నాగరాజు పాల్గొన్నారు.

'మాట తప్పడు, మడమ తిప్పడు లోకేష్'

ప్రజాశక్తి - పెనుమంట్ర

తల్లికి వందనం కుటుంబంలో చదువుకుంటున్న పిల్లలందరికీ వర్తింపజేస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ ప్రకటించడం పట్ల నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ బిసి కమిటీ ప్రతినిధి రొబ్బి భాస్కరరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మార్టేరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికీ అమ్మఒడి ఇస్తామని చెప్పిన వైసిపి అధికారంలోకొచ్చాక ఒక్కరికే అని చెప్పిందని తెలిపారు. అయితే ఇంట్లో ఎంత మంది బిడ్డలుంటే అందరికీ ముఖ్యంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులందరికీ తల్లికి వందనం వర్తించేలా కూటమి ప్రభుత్వం చేయడం అభినందనీయమన్నారు.

వరద బాధితులకు అన్నదానం

తాడేపల్లిగూడెం: మండలం ఆరుళ్ల, నందమూరి గ్రామాల్లో ఎర్ర కాలువ వరద బాధితులకు పెదతాడేపల్లి టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటిసి పసుమర్తి చందు సహకారంతో గురువారం సుమారు వెయ్యి మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ గత ప్రభుత్వ అసమర్థత కారణంగా ఎర్ర కాలువ పరివాహక ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, సర్పంచి పోతుల అన్నవరం పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు రూ.6.91 లక్షల ఆదాయం

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించామని ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. అమ్మవారికి యాత్రికులు 36 రోజులుగా కానుకలు, మొక్కుబడుల రూపంలో రూ.6,91,716 ఆదాయం సమకూరిందని రామకృష్ణంరాజు తెలిపారు. గుమ్ములూరులోని సోమేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి రాజా పర్యవేక్షణ లెక్కింపు కార్యక్రమం నిర్వహించామన్నారు. లెక్కింపులో ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మిషన్ శక్తి ఉపయోగకరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వంద రోజుల మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 17వ వార్డు అంగన్వాడీ కేంద్రం వద్ద జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుజాత రాణి ఆధ్వర్యంలో తల్లులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ 1860ను భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)గా మార్పు చేశారని,క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973ను భారతీయ న్యాయ సురక్ష సంహితగా మార్పు చేశారని తెలిపారు. కొత్తగా వచ్చిన ఈ 3 చట్టాలు ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ చట్టాల్లో ముఖ్యంగా మహిళలకు, పిలలకు సంబంధించిన చట్టాలను చేర్చడం జరిగిందని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒ టిఎల్.సరస్వతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆచంట : వంద రోజుల మిషన్ శక్తి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డివిఎస్ఆర్ఎస్.కుమారి అన్నారు. గురువారం కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంద రోజుల మిషన్ శక్తి కార్యక్రమం అంగన్వాడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కుమారి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నిరోధానికి గాను ప్రభుత్వం చేపట్టిన చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నరసాపురం : మండలంలోని చిట్టవరం గ్రామం హైస్కూల్ వద్ద మొగల్తూరు మహిళా శిశ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మిషన్ శక్తి 100 డేస్ ప్రోగ్రాంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. బేటీ బచావో బేటీ పడావో, బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, రక్తహీనతపై వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సదస్సులో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.విజయ్‌కుమారి, న్యాయవాదులు శిరీష, పద్మజ, లాయర్ నక్కా ఆనందబాబు పాల్గొన్నారు.

పెనుగొండ : మిషన్ మహిళా శక్తి 100 రోజుల కార్యక్రమాన్ని జెడ్‌పిహెచ్ స్కూల్ చెరుకువాడ ప్రధానోపాధ్యాయులు పి.భరత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 6 సంవత్సరాల్లోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలన్నారు. గ్రామ సర్పంచి నక్కా శ్యామలాసోనీ మాట్లాడారు. కార్యక్రమంలో లింగ వివక్ష, మహిళల రక్షణపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిఎన్ఆర్ విద్యార్థిని ప్రతిభ

పాలకొల్లు : పాలకొల్లు దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బిఎస్‌సి విద్యార్థిని శెట్టి సునీత సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విజయనగరంలో కెమిస్ట్రీ పీజీ అడ్మిషన్ పొందిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి అభినందించారు. ప్రభుత్వ కళాశాలలో చదివిన నిరుపేద విద్యార్థిని అత్యున్నత విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందడం అభినందనీయమన్నారు. కెమిస్ట్రీ అధ్యాపకులు విజయ్ స్వరూప్‌సింగ్, విజయలక్ష్మిని అభినందించారు. ర్యాంకులు సాధించిన ఇతర విద్యార్థినులను వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ అభినందించారు.

సకాలంలో సర్వే చేయండి

ఉండి: పారిశుధ్య నివారణ సర్వేను సకాలంలో పారదర్శకంగా పూర్తి చేయాలని మండల అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో రవీంద్ర మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ, మరుగుదొడ్లు, తాగునీరు వంటి అంశాలపై సర్వే నిర్వహించి పిఆర్‌వన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే స్వచ్ఛభారత్ లక్ష్యమన్నారు. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కె.శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు అందజేత

గణపవరం: ఉచిత బస్ పాస్‌లను విద్యార్థులు వినియోగించుకోవాలని తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపో మేనేజర్ వైఎస్ఎన్.మూర్తి, మానవత డైరెక్టర్ పాతపాటి హరికుమార్ రాజు అన్నారు. గురువారం పిప్పర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఉచిత బస్ పాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముప్పర్తిపాడు గ్రామ పూర్వ విద్యార్థి, ప్రస్తుత ఆర్‌టిసి తాడేపల్లిగూడెం ఉద్యోగి కొవ్వూరి చినరామిరెడ్డి తన భార్య నాగసత్యవతి జ్ఞాపకార్థం 200 మంది విద్యార్థులకు బస్ పాసులు అందజేయడానికి ఆర్థిక సహకారం అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన సభకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెనుమర్తి జె.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం రామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి పిఆర్ఒ దొంతుల విజయకుమార్, ఉపాధ్యాయులు, ముప్పర్తిపాడు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.